రికార్డు స్థాయిలో కందులు, పప్పు ధరలు

తాండూరు, జూన్ 15: తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కందులు, ఓల్‌సెల్ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో కందిపప్పు ధర పలుకుతోంది. గతంలో ఎన్నడు లేని విధంగా కందులు క్వింటాల్‌కు రూ. 12,421 పలకగా, కంది పప్పు క్వింటాల్‌కు రూ. 18వేలు పలకుతుంది. కంది పప్పుకు భౌగోళిక గుర్తింపు రావడంతో కందిపప్పు ధర పెరిగింది. క్వింటాళ్ల కందులు కనీసం మద్దతు ధర రూ.6850 ఉండగా, రెట్టింపు ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

• మొలకెత్తిన ఆశలు





నల్లరేగడి భూమి పత్తిపంట సాగుకు అనువు.. తొలకరి వర్షాలు కురియడంతో రైతులు విత్తనాలు విత్తారు. దీంతో బషీరాబాద్ మండలం గొట్టిగ ఖుర్దు గ్రామ శివారులో పత్తి విత్తనం మొలకెత్తుతోంది. ఇప్పుడిప్పుడే చెలకల్లో విత్తులు మొలకెత్తుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారి వానకాలం సీజన్‌లో మండల వ్యాప్తంగా అన్ని రకాల పంటలు కలిపి 20వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

• వావ్.. నయా ట్రెండ్

ప్రస్తుతం మారుతున్న సమాజంతో పాటు రైతన్న కూడా సాగులో అధునాతన పద్దతులు అవలంబిస్తున్నాడు. ఒకప్పుడు కలపతో ఎడ్లబండ్లు, వ్యవసాయ పని ముట్లు, పంట ఉత్పత్తులను తరలించే పని ముట్లను తయారు చేసి వినియోగించేవారు. ఇప్పుడు కట్టెల వినియోగం తగ్గిపోవడంతో ఇనుముతో చేసిన ఎడ్లబండ్లను కొనుగోలు చేసి సాగు పనులకు వినియోగిస్తూ ముందుకు సాగుతున్నాడు. బషీరాబాద్ మండలం నవాల్గ శివారులో ఓరైతు ఇనుప ఎడ్లబండిపై పొలాలనికి వెళ్తుండగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.



(బషీరాబాద్, జూన్15)

సమయపాలన పాటించాలి

- రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్
- డీఎంహెచ్‌వో కార్యాలయం, చెన్‌గోముల్ పీహెచ్‌సీ సందర్శన



చెన్‌గోముల్ ఆసుపత్రిలో మెడిసిన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్

పూడూరు/వికారాబాద్, జూన్ 15 : వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ తెలిపారు. శనివారం పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో మెడిసిన్‌లను, రిజిష్టర్లు, రోగుల సంఖ్యను రోజువారీగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వానాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగులతో దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో రికార్డుల పరిశీలన...

తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ వికారాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా కార్యాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరు తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో పాల్వన్ కుమార్, 5మంది ప్రోగ్రామ్ ఆఫీసర్లతో రివ్వ్యూ నిర్వహించారు. వారి పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు వారి విధుల గురించి ఒక్కొక్కరిగా అడిగి తెలుసుకున్నారు. సుమారు గంట పాటు అధికారులతో మాట్లాడిన హెల్త్ డైరెక్టర్ అంతకు ముందు పూడూరు మండలం చన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో

పనులు వేగవంతం చేయాలి

వికారాబాద్, జూన్ 15: అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు వేగవంతం చేయాలని జిల్లా విద్యాధికారి(డీఈవో) రేణుకాదేవి సూచించారు. శనివారం వికారాబాద్ మండలం గొట్టిముక్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలు, యూనిఫాంగురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు స్వప్న, ఉపాధ్యాయులకు డీఈవో పలు సూచనలు చేశారు.



గొట్లిముక్ల పాఠశాలను పరిశీలిస్తున్న రేణుకాదేవి

కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో సారి భూముల విలువ పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏఏ ప్రాంతాల్లో భూముల ధరలు పెంచాలనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా రాష్ట్రంలో మిగతా చోట్లతో పోలిస్తే హైదరాబాద్ చుట్టు పక్కల విస్తరించి ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు అధికంగానే ఉంటాయి. ఈ మేరకు ఏఏ ప్రాంతాల్లో భూములు ధరలు ఎంతెంత పెంచాలనే దానిపై ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ఆదేశించింది. దీంతో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పని మొదలు పెట్టారు.

- 111జీవో పరిధిలో భారీగా పెరిగే అవకాశం
- ఎక్కువ ఉన్న చోట తగ్గించే విషయం పరిశీలన
- ఇప్పటికే కమిటీలు ఏర్పాటు చేసిన సర్కార్
- జిల్లా స్థాయి కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ నియామకం



భూముల విలువ పెంపునకు కసరత్తు!

శివార్లలో పలు చోట్ల పెరగనున్న భూముల విలువ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూముల విలువలు భారీగా పెరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల విలువ పెంచాలని సర్కార్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితుల ఆధారంగా భూముల మార్కెట్ ధరలను సవరించాలని సర్కార్ ఆదేశించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్‌ను చైర్మన్‌గా నియమించారు. ఇక కింద స్థాయిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వేరుగా కమిటీలను నియమించారు. పట్టణ ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో నియమించిన కమిటీలు తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీవో ఆధ్వర్యంలో ఉండే కమిటీలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే వీరంతా ఆయా ప్రాంతాల్లో భూముల ధరల పెంపుపై అధికారులు కరసరత్తు మొదలు పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత గత ప్రభుత్వం రెండు సార్లు రిజిస్ట్రేషన్ల భూముల ధరలతో పాటు స్టాంప్ డ్యూటీని కూడా పెంచింది. రాష్ట్రంలో 2021 జూలైలో ఆ తరువాత 2022 ఫిబ్రవరిలో భూముల విలువ పెంచారు. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి భూముల విలువ పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏఏ ప్రాంతాల్లో భూముల ధరలు పెంచాలనేదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా రాష్ట్రంలో మిగతా చోట్లతో పోలిస్తే హైదరాబాద్ చుట్టు పక్కల విస్తరించి ఉన్న ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో భూముల ధరలు అధికంగానే ఉంటాయి. హైదరాబాద్ మహానగరంలో అంతర్భాగంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో భూములు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. గతంలో రంగారెడ్డిజిల్లాలోని జరిగిన ప్రభుత్వ భూముల వేలంలో ఎకరా గరిష్ఠంగా రూ. 100కోట్లు పలికిన సంగతి తెలిసిందే. అయితే వాస్తవానికి ఆ ప్రాంతంలో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ పట్టుమని రూ.10కోట్లు కూడా లేదు. దీంతో వాస్తవ ధరకు రిజిస్ట్రేషన్ శాఖ నిర్ధారించే ధరకు పదిరెట్ల వరకు తేడా ఉంటుంది.



ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా భూముల విలువ పెంచాలని నిర్ణయించింది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చివరి సారిగా 2013లో భూములు ధరలు పెంచారు. తరువాత 2021, 2022లో వరుసగా భూముల విలువ సవరించారు. అయితే అనేక చోట్ల వాస్తవ ధరలకు. ప్రభుత్వ నిర్ధారిత ధరకు పొంతన లేకుండా ఉంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా గండిపడుతోంది. ఇది గుర్తించిన ప్రభుత్వం భూములు విలువ పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు అయితే ఏఏ ప్రాంతాల్లో భూములు ధరలు ఎంతెంత పెంచాలనేదానిపై స్థానికంగానే కసరత్తు చేసి ఈ మేర ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం ఆదేశంతో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పని మొదలు పెట్టారు. కొన్ని చోట్ల పక్కపక్క భూముల మధ్య మార్కెట్ విలువలో భారీగా వ్యత్యాసాలు ఉన్నందున వీటిని గుర్తించి సవరించాలని ప్రభుత్వం ఆదేశించింది. తక్కువ ఉన్న చోట ధరల పెంపుతో పాటు ఎక్కువ ఉన్న చోట తగ్గించాలని కూడా సూచించింది. ఈ మేరకు అధికారులు ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

మారుమూల ప్రాంతాల్లో 30శాతం

అలాగే కొత్తగా నిర్మించనున్న రీజినల్ రింగురోడ్డు నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని నగరానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో కూడా భూముల విలువ భారీగా పెంచనున్నారు. రోడ్డు, రవాణా మౌలిక సదుపాయాలు ఉన్న చోట్ల భారీగా భూముల విలువ పెంచాలని నిర్ణయించారు. ఔటర్ రింగురోడ్డు, మాస్టర్ ప్లాన్ ప్రకారం కొత్త రోడ్లు వేసే ప్రాంతాల్లో ధరలు భారీగా పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా 30శాతం వరకు భూములు విలువ పెంచవచ్చని తెలుస్తోంది.

పలు చోట్ల భారీగా పెరిగే అవకాశం

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ భూములన్ని ఎక్కువగా వ్యవసాయేతర భూములుగా మారాయి. గతంలో ఎకరాలు అమ్మిన ప్రాంతాలు కాస్తా ఇప్పుడు వెంచర్లుగా చేసి గజాలుగా అమ్మేస్తున్నారు. చాల వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగాను, అపార్టుమెంట్, విల్లాలుగా మారాయి. నగర శివార్లలో 111జీవో ఎత్తివేయడంతో ఈ పరిధిలోని దాదాపు లక్షన్నర ఎకరాల భూముల్లో ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ జీవో పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఏకంగా నాలుగైదు రెట్ల ధరలు పెరిగాయి. జీవో పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఎకరా భూమి రిజిస్ట్రేషన్ విలువ రూ. 25లక్షలు లోపుగానే ఉంది. అయితే ఇప్పుడు ఈ ప్రాంతాల్లో ఎకరా మార్కెట్ ధర దీనికి రూ. 20రెట్ల వరకు అధికంగా ఉంది. ఇప్పుడు ఇలాంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ధరలు సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వికారాబాద్ కలెక్టర్‌గా ప్రతీక్ జైన్

- నేడు బాధ్యతలు స్వీకరించనున్న కొత్త కలెక్టర్
- కలెక్టర్ నారాయణరెడ్డి నల్లగొండ జిల్లాకు బదిలీ
- అభివృద్ధిని పరుగులు పెట్టించిన అధికారి
- తక్కువకాలం పని చేసినా చెరగని ముద్ర
- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు కలెక్టర్‌గా పదోన్నతి



ప్రతీక్ జైన్



నారాయణరెడ్డి



రాహుల్‌శర్మ

వికారాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయగా, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ సర్కారు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణరెడ్డి స్థానంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పని చేస్తున్న ప్రతీక్‌జైన్ వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆదివారం ఉదయం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నారాయణరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రతీక్‌జైన్ గౌహతి ఐఐటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్య 2013లో పూర్తి చేసుకోగా, 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఆయన రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. 2023, ఫిబ్రవరి 2వ తేదీన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డి జిల్లాలో 17 నెలల పాటు కొనసాగారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి జిల్లాలో పాలనను గాడిలో పెట్టారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో జిల్లాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రజావాణి మొదలుకుని విద్య, వైద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఇంజనీరింగ్ శాఖల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరుగులు పెట్టించారు. ఉపాధిపనులు, వైకుంఠధామాలు, ప్రకృతి, బృహత్ వనాల పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యతా అంశాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎన్నికలు ముగియడంతో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించే ఈ సమయంలో కలెక్టర్ జిల్లా నుంచి బదిలీ అయ్యారు. అందరితో మెలుగుతూ వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్నారు. కలెక్టర్‌గా తక్కువ కాలం పనిచేసినా చెరగని ముద్ర వేశారు.

రాహుల్‌శర్మకు పదోన్నతి

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. 2022, నవంబరు 14న జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ శర్మ వికారాబాద్ జిల్లాలో 19 నెలల పాటు విధులు నిర్వహించారు. రాహుల్ శర్మ 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 2018 మే నుంచి 2019 ఏప్రిల్ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన ఆయన ఆ తరువాత న్యూఢిల్లీలో 2019 సెప్టెంబర్ వరకు అసిస్టెంట్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2020, ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఆయన బాధ్యతలు నిర్వహించగా, అక్కడి నుంచి వికారాబాద్ జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్థానిక సంస్థల్లో పన్నుల వసూళ్లు, వివిధ అభివృద్ధి పనులు వేగం పుంజుకునేలా రాహుల్‌శర్మ తనదైన శైలిలో కృషి చేశారు. ఈసారి ఐఏఎస్ అధికారుల బదిలీల్లో రాహుల్‌శర్మకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, గత నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా జరిగేలా పర్యవేక్షించారు. అందరితో కలుపుగోలుగా వ్యవహరించే ఆయన సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు.

దోబూచులాట!

కమ్ముకుంటున్న కారుమబ్బులు.. కురవని వాన

- చెలక భూముల్లో ఇప్పటికే విత్తనాలు వేయాల్సింది
- నల్లరేగడిలో నెలాఖరు వరకు అదును
- రెండోసారి దుక్కులు చదును
- వర్షాల కోసం రైతుల ఎదురుచూపు



పరిగి, జూన్ 15: ఈసారి తొలకరి ముందుగానే ప్రారంభమైనట్లు వాతావరణంలో మార్పులు కనిపించినప్పటికీ రైతులకు నిరాశే ఎదురైంది. పది రోజుల క్రితం వర్షం కురిసి మురిపించింది. ఆ తర్వాత ఆకాశంలో మార్పులు సంభవిస్తున్నా.. వర్షం కురిపించడంలో వరుణ దేవుడు దోబూచులాడుతూనే ఉన్నాడు. కాగా, మృగశిర కార్తి వెళ్లిపోయింది. ఇప్పటికే చెలక భూముల్లో విత్తనాలు నాటడం పూర్తి కావాల్సింది. కానీ, మేఘాలు ముఖం చాటేయడంతో అన్నదాత దిగాలు చెందుతున్నాడు. అక్కడక్కడా చిరుజల్లులు, మోస్తరు వర్షం కురుస్తున్నా.. విత్తనాలు విత్తుకునేందుకు వీలుగా లేకపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా కొద్దిపాటి వర్షం కురిసినా.. పరిగిలో మాత్రం విత్తనాలు విత్తేంత వర్షం పడలేదు. భూములన్నీ చదునుచేసి సాగుకు సిద్ధమైన రైతులు వరుణదేవుడి కరుణకు ఆకాశానికేసి ఎదురుచూస్తున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే ఈ పాటికి విత్తనాలు విత్తడం పూర్తయ్యేదని చెబుతున్నారు. అయితే, కొందరు రైతులు మాత్ర ఇప్పటికే విత్తనాలు విత్తారు. వర్షం కురిస్తేనే విత్తనాలు మొలకెత్తే పరిస్థితి ఉందని వాపోతున్నారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కాలం కలిసి రావడంలేదు.

పురపాలక సంఘం అభివృద్ధికి కృషి

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, జూన్ 15 : పురపాలక సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక పరిధిలోని అన్నివార్డుల అభివృద్ధికి చర్యలు సుకుంటున్నామన్నారు. పార్టీలకతీతంగా కౌన్సిలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా వార్డుల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల నిమిత్తం రూ.6.48కోట్లు, పారిశుధ్య పనుల నిర్వహణకు రూ.20 లక్షల కేటాయిస్తూ తీర్మాణం చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, రాంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌకుంట్ల చంద్రారెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్, నైపుణ్యంతోనే ఉద్యోగాలు

● కాగ్నిజెంట్ హెచ్ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్



ప్లేస్‌మెంట్స్ పొందిన విద్యార్థులతో జితేందర్‌సింగ్ తదితరులు

ఇబ్రహీంపట్నం, జూన్ 15: విద్యార్థికి స్కిల్ డెవలప్‌మెంట్, నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు సాధించడం సులవవుతుందని కాగ్నిజెంట్ హెచ్ఆర్ మేనేజర్ ఆర్.జితేందర్‌సింగ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరి గూడ శ్రీదత్త విద్యాసంస్థల్లో ప్లేస్‌మెంట్స్ అచీవర్స్ డే, ఇంజనీరింగ్ ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఏ కోర్సులోనైనా మొదటి సంవత్సరం నుంచే ప్రణాళిక రూపొందించుకుని సాంకేతిక నైపుణ్యాలకు తగ్గట్టుగా ముందుకుపోవాలన్నారు. శ్రీ దత్త విద్యా సంస్థల చైర్మన్ జి.పాండురంగారెడ్డి మాట్లాడుతూ ప్రొటో టైప్ మోడల్స్, మైక్రో మినీమేజర్ ప్రాజెక్టులు సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనాపత్రాలు తయారు చేయడంలో తమ విద్యార్థులకు తగిన విధంగా శిక్షణ ఇవ్వడంతోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు పొదగలుగుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వర్చుసా క్యాంపస్ (ఇండియా) మేనేజర్ డి.అభిషేక్, శ్రీదత్త విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా.జీ.వీ.ఎన్. విభవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.ఎస్.వెంకటేశ్వర్లు, డా.ఎం.సింథెల్‌కుమార్, డా.చంద్రశేఖర్, డీన్‌లు డా.అచ్యుతరావు, డా.రమేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్.అశోక్‌కుమార్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశ పురోగతికి పాటు పడాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, జూన్ 15: ఉన్నత చదువులు చదివిన వారు దేశ పురోగతికి పాటు పడాలని మల్లారెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్స్‌లో 13వ గ్రాడుయేషన్ డేను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లారెడ్డి విద్యార్థులకు పట్టాలు అందజేసి ప్రసంగించారు. ప్రపంచంలోని అతిపెద్ద వ్యాపారసంస్థల్లో ఉన్నత స్థాయిలో పనిచేసే వారిలో భారతీయులు అధికంగా ఉండటం అభినందనీయమన్నారు. విద్యారంగంలో చోటుచేసుకున్న విప్లవాత్మకమైన మార్పుల కారణంగా నేడు చాలామంది ఉన్నత చదువులు చదివి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించేస్థాయికి చేరుకున్నారన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో విద్యనభ్యసించే విద్యార్థులు దేశ, అభివృద్ధితో పాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ శాలినీరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మాదవీలత, ఎంఆర్‌జీఐ ఎండీ చామకూర మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

10,222 లీటర్ల మద్యం బాటిళ్లు ధ్వంసం

- గోవా సహా పలు రాష్ట్రాల నుంచి ప్రయాణికులు సుంకం చెల్లించకుండా తీసుకొచ్చిన రూ.1.83 కోట్ల మందు
- మే 2023 నుంచి డిసెంబర్ వరకు పట్టుబడిన మద్యం

రాజేంద్రనగర్, జూన్15 (ఆంధ్రజ్యోతి) : గోవా, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌ల నుంచి సుంకం చెల్లించకుండా ప్రయాణికులు తీసుకువస్తున్న 10,222 లీటర్ల మద్యం బాటిళ్లను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు శనివారం రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కాగా, బాటిళ్ల విలువ రూ. 1,83,42,763గా ఉంటుందని అధికారులు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలో గల శంషాబాద్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2023 మే నుంచి గత డిసెంబర్ వరకు నమోదైన 686 కేసులలో సుంకం చెల్లించకుండా వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్న మద్యాన్ని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన కేసులు కోర్టులో నడుస్తున్నాయి. సుంకం చెల్లించకుండా ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని తీసుకురావడం నేరమని గుర్తు చేశారు. దాని వల్ల తెలంగాణ రాష్ట్ర ఆదాయానికి నష్టం కలుగుతుందన్నారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్న మద్యం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురైనా ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు, ముఖ్యంగా గోవా నుంచి సుంకం చెల్లించకుండా మద్యాన్ని తీసుకువచ్చినట్లయితే వారిపై చర్యలు తప్పవన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విదేశీ మద్యం అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని గుర్తుచేశారు. అన్ని విషయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలేకరుల సమావేశంలో శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గంద్ర దేవేందర్‌రావులు తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం, రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేయిస్తున్న అధికారులు(ఇన్‌సెట్లో)

డయాలసిస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- భయాందోళనతో పరుగులు తీసిన వైద్యసిబ్బంది, రోగులు
- చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో ఘటన.. షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం
- మంటలను ఆర్పివేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం.. ఊపిరి పీల్చుకున్న వైద్యసిబ్బంది


డయాలసిస్ గదిలో మంటలు చెలరేగి కాలిపోతున్న సామగ్రి


ఆసుపత్రి ఆవరణలో రోగులు, వైద్య సిబ్బంది తదితరులు

చేవెళ్ల, జూన్ 15 : చేవెళ్ల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో శనివారం రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దాంతో డయాలసిస్ సెంటర్‌లో ఒక్కసారిగా పొగతో కూడిన మంటలు చేలరేగాయి. గదిలో నుంచి పొగతోపాటు మంటలు బయటకు చిమ్మటంతో వైద్యసిబ్బంది భయభ్రాంత్రులకు గురయ్యారు. వెంటనే ఆసుపత్రిలో ఉన్న రోగులను హుటాహుటిన బయటకు పంపించారు. వైద్యసిబ్బంది సైతం బయటకు పరుగులు తీశారు. అయితే, ఆ సమయంలో డయాలసిస్ సెంటర్ గదికి తాళం వేసి ఉంది. మంటలు, పొగ వెంటిలేటర్, కిటికీల ద్వారా బయటకు వ్యాపించాయి. పోలీస్‌లకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే డయాలసిస్ గదిలో ఉన్న ఫైళ్లు, వైద్యపరికరాలు కాలిపోయాయి. విద్యుత్ సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని కరెంటు సరఫరా నిలిపివేశారు. చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌ఎకుమార్ ఆసుపత్రికి చేరుకుని షార్ట్‌సర్క్యూట్‌కు గల కారణాలు, వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వద్ద పరిస్థితిని సమీక్షించారు. కాగా, ప్రమాద సమయంలో ఆసుపత్రిలో కాన్పుకోసం వచ్చిన గర్భిణీలు, బాలింతలు, కొందరు ఇతర రోగులు ఉన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు బయటనే ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. పాడైన విద్యుత్ వైర్‌తో పాటు వైరు కూడా సక్రమంగా లేకపోవడమే షార్ట్‌సర్క్యూట్‌కు కారణమై ఉంటుందని పోలీస్‌లు, విద్యుత్ సిబ్బంది భావిస్తున్నారు. ఈ సంఘటన రాత్రి 8గంటల జరిగిందని, అర్ధరాత్రి జరిగి ఉంటే పెనుప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. డయాలసిస్ సెంటర్‌లో రాత్రివేళల్లో పరీక్షల నిర్వహణ జరగదని, పగటి పూట ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని వైద్యులు, సిబ్బంది పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఆసుప్రతి సిబ్బంది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అటవీ భూముల కబ్జాకు పాల్పడవద్దు

- హద్దులు దాటితే కఠిన చర్యలు
- తాండూరు డివిజన్ ఫారెస్ట్ రేంజర్ శ్యామ్ సుందర్‌రావు



బషీరాబాద్, జూన్ 15: తెలంగాణ-కర్ణాటక అటవీ భూముల్లో హద్దులను దాటొద్దని, ఎవరైనా భూకబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు డివిజన్ ఫారెస్ట్ రేంజర్ శ్యామ్ సుందర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన తాండూరులో విలేకరులతో మట్లాడుతూ మండలంలోని నీళ్లపల్లి-మైల్వార్ రిజర్వు ఫారెస్టులో కొన్నేళ్లుగా రెండు రాష్ట్రాల సరిహద్దులు తేలకపోవడమనేది పెద్ద సమస్యగా మారిందన్నారు. సరిహద్దు ప్రాంత గ్రామాల కన్నడిగులు మన రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలోకి చొచ్చుకొచ్చి అక్రమంగా భూములను కబ్జా చేస్తున్నారని అన్నారు. ప్రతి యేటా హద్దులు దాటి కన్నడిగులు భూ కబ్జాలకు యత్నించడంతో అడ్డుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ అటవీ భూముల్లోకి కన్నడిగులు వచ్చి కబ్జాలకు ప్రయత్నించడంతో ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల రైతుల మధ్య పరస్పరం గొడవలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ భూముల్లోకి ఇకపై ఎవరైనా వచ్చి కబ్జాలకు పాల్పడేందుకు యత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శుక్రవారం ఇరు రాష్ట్రాల రెవెన్యూ, ఫారెస్టు అధికారులందరం కలిసి సర్వేయర్లతో అటవీ భూముల్లో కలియతిరిగి ప్రాథమికంగా ఇరు రాష్ట్రాల హద్దులను నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ విషయమై జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. సరిహద్దు అంశం ఓ కొలిక్కి వచ్చినందున.. త్వరలో ఇరు రాష్ట్రాల కలెక్టర్లకు సర్వేల నివేదికను అందజేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కిషన్

కీసర రూరల్, జూన్ 15 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించి, నైపుణ్యాన్ని వెలికితీయాలని కేంద్ర కుటుంబ, ఆరోగ్య శాఖ డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా మండలి సభ్యుడు డాక్టర్. ఎ.రామ్‌కిషన్ పిలుపునిచ్చారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో కొనసాగుతున్న కేజీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల 15 వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఆయన శనివారం విచ్చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో శ్రమించిన వారిని మాత్రమే విజయం వరిస్తుందన్నారు. భారతదేశంలో భవిష్యత్తు అంతా యువతదేనని, నేడు దేశం అన్నిరంగాల్లో దూసుకుపోతోందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. ప్రజా అవసరాలను పసిగట్టి.. అందుకు అనుగుణంగా ఉత్పత్తులను సాధించాలని సూచించారు. కళాశాల చైర్మన్ గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా, ఆర్థికంగా వెనుకబడిన వారికి నాణ్యమైన విద్యనిందించేందుకు కళాశాలను స్థాపించినట్లు వివరించారు. అనంతరం కళాశాల విజయవంతంగా కొనసాగేందుకు సహకరిస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ రమణారావు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి, ఇతర విభాగాల అధిపతులు ప్రొఫెసర్లు కె.సునీత, రంగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కేఎస్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.వేణు, డాక్టర్ ఎం.శ్రీనివాస్, బాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్షల్లో కరెంటు బిల్లు.. రైతు అవాక్కు

- ఒక నెలకు రూ.7,37,440 వచ్చిన వైనం
- సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన బాధితుడు
- అప్రమత్తమైన విద్యుత్ అధికారులు.. డేటా తొలగింపు

వికారాబాద్, జూన్ 15: వామ్మో.. ఒక రైతుకు రూ.లక్షల్లో కరెంట్ బిల్లు వచ్చింది. అది చూసిన రైతు ఒక్కసారిగా అవాక్కయ్యాడు. అది ఎక్కడో కాదు.. వికారాబాద్ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం.. వికారాబాద్ మండలం సిద్దులూరు గ్రామంలో. మొన్నటికి మొన్న జిల్లా కేంద్రంలో సామాన్య ప్రజలకు గతంతో పోలిస్తే రెండు రెట్ల కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చింది. తాజాగా సిద్దులూరులో ఎన్కెపల్లి గోపాల్‌కు అక్షరాల రూ. 7,37,440 కరెంట్ బిల్లు వచ్చింది. గమనించిన రైతు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అప్రమత్తమైన విద్యుత్ అధికారులు కంప్యూటర్‌లో డేటా నుంచి బిల్లును తొలగించారు. అయితే, పట్టణంలో ప్రతీనెల 29 రోజులకు బిల్లువేసిన అధికారులు.. ఈనెల 37 రోజులకు, 39 రోజులకు బిల్లు కొట్టడంతో రూ.700 వచ్చే కరెంట్ బిల్లు రూ.1500 రావడం, రూ.1500 రావాల్సిన బిల్లు రూ.3వేలు రావడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఓ వైపు కరెంట్ కోతలు విధిస్తూనే మరోవైపు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో వేలల్లో కరెంట్ బిల్లు వస్తుందని వినియోగదారులు మండిపడుతున్నారు.


Bill Details HIDE

Customer Name	: YENKEPALLY GOPAL
Bill Number	: A340001073
Bill Date	: 12-Jun-2024

₹ 7,37,440

Due Date: 26-Jun-2024

రైతు ఎన్కెపల్లి గోపాల్‌కు వచ్చిన కరెంట్ బిల్లు

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

కీసర రూరల్, జూన్ 15 : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. శనివారం కీసర పోలీస్ పరిధిలోని అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్‌నేషనల్ స్కూల్, నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో ఉజ్వల భవిష్యత్ కోల్పోవటంతో పాటు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల తయారీలో భాగస్వాములైనా, కలిగియున్నా, వినియోగించినా చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలను సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. డ్రగ్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సైలు మధు, హరిప్రసాద్, పాఠశాలల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు వదిలేశారు.. వృద్ధాశ్రమంలో చేర్పించండి

- ఓ వృద్ధురాలి ఆవేదన


కరన్‌కోట్ బస్టాండ్‌లో వృద్ధురాలు వెంకటమ్మ

తాండూరు రూరల్, జూన్ 15: ఆ తల్లికి నలుగురు సంతానం. నలుగురిని ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేసింది. తీరా పెద్దయ్యాక ఆ నలుగురు పిల్లలు ఎవరి దారి వారు చూసుకుని కన్నతల్లిని వదిలేశారు. వృద్ధాప్యంలో ఆతల్లి దిక్కుతోచని స్థితిలో బస్టాండ్‌లో తలదాచుకుంటోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కరన్‌కోట్‌కు చెందిన చిట్లపల్లి వెంకటమ్మగౌడ్(70 సంవత్సరాలు) భర్త మృతిచెందాడు. వెంకటమ్మకు ఇద్దరు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే ఒక కొడుకు హైదరాబాద్‌లో, మరో కొడుకు బషీరాబాద్‌లో ఉంటున్నారు. కుమార్తెల వివాహం జరిగింది. ఆ తల్లికి ఆస్తుపాస్తులు కూడా లేకపోవడంతో తనపిల్లలు ఎవరూ ఆ తల్లి బాగోగులు చూసుకోవడంలేదు. దీంతో ఆ వృద్ధతల్లి దిక్కుతోచని స్థితిలో కరన్‌కోట్ బస్టాండ్‌లో తలదాచుకుంటోంది. వర్షానికి తడుస్తూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. తనను ఎరవైనా వృద్ధాశ్రమంలో చేర్పించాలని వెంకటమ్మ వేడుకుంది.

ఆదమరిస్తే అంతే..!

బొంరాస్‌పేట్, జూన్ 15: తుంకిమెట్ల నుంచి బొంరాస్‌పేట్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో గత రాత్రి కురిసిన వర్షానికి భారీ గుంతలు ఏర్పడ్డాయి. బొంరాస్‌పేట్ పెద్ద చెరువు అలుగు పారే దగ్గర రోడ్డు మధ్యలో రెండు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గ్రామ పంచాయతీలకు ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించేందుకు ఇటీవల రోడ్డు పక్కనే గుంతలు తీశారు. వాహనదారులు ఆదమరిస్తే వాటిలో పడి ప్రమాదబారిన పడే అవకాశముంది. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


బొంరాస్‌పేట్ అలుగు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత →

న్యాయవాది వృత్తిలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 15: జిల్లా పరిధిలో లా కోర్సు చదివిన బీసీ విద్యార్థులు న్యాయవాది వృత్తిలో 3 సంవత్సరాలు ఉచిత శిక్షణ పొందుటకు 2024-25 విద్యా సంవత్సరానకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరుగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. అర్హులైన బీసీ యువతీయువకులు వెనుబడిన తరగతులకు చెందిన అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి గుర్తింపు పొందిన కళాశాల నుంచి లా పాసై ఉండాలన్నారు. వయోపరిమితి జూలై 2024 నాటికి 23 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారైతే.. రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2లక్షలు ఉండాలన్నారు. అభ్యర్థులు గతంతో ఇదివరకు ఉచిత శిక్షణ పొంది ఉండదరాదన్నారు. డిక్లరేషన్ జతచేయాలని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలని సూచించారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను ఆసక్తి గల అభ్యర్థులు కలెక్టరేట్ కార్యాలయంలోని బీసీ వెనుకబడిన తరగతుల శాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

పీఈటీలు, పీడీల సమస్యలు పరిష్కరించండి

యాచారం, జూన్ 15 : వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు బాబయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ సాబేర్‌లు రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనను జిల్లాకు చెందిన పీఈటీలు, పీడీలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు వారు శనివారం నగరంలోని స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదోన్నతులు, బదిలీలు తక్షణమే చేపట్టాలని కోరారు. అప్‌గ్రేడేషన్‌కు అడ్డంకిగా ఉన్న నిబంధనలు సవరించి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. బదిలీలు, పదోన్నతులలో అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేవసేను కలిసినవారిలో జిల్లా పీఈటీలు పీడీల సంఘం నాయకులు దేవదాస్, యాదమ్మ, సుధ, అజయ్‌రాథోడ్, భాస్కర్, బాల్లయ్య, కవిత, నిర్మల తదితరులున్నారు.


దేవసేనకు వినతిపత్రం అందజేస్తున్న పీఈటీలు, పీడీలు

గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకోండి

- యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి



యాచారంలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్యబాషా

యాచారం, జూన్ 15 : మండలంలోని వివిధ గ్రామాల్లో మహలక్ష్మి, గృహలక్ష్మి పథకాలు వర్తించనివారు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, ఎంపీడీవో నరేందర్‌రెడ్డిలు మండల ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహలక్ష్మి, మహలక్ష్మి పథకాలు వర్తించని వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే కార్యాలయ సిబ్బంది పరిశీలన చేసి పేదలకు పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటారని వారు చెప్పారు. ప్రతీ దరఖాస్తును తాము క్షుణ్ణంగా పరిశీలన చేసి పేదలందరికీ పథకాలు వర్తించే విధంగా తాము కార్యాచరణ రూపొందించామని ఎంపీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయని, వాటిని పరిశీలన చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నాలుగు నెలలుగా డిప్యుటేషన్‌పై డీటీ..

ఎంఆర్‌ఎఫ్‌డీసీకి తహసీల్దార్

- ధరణి స్పెషల్ డ్రైవ్ ముగిసేదాకా తహసీల్దార్ వెళ్లొద్దని కలెక్టర్ ఆదేశం
- ఇద్దరూ డిప్యుటేషన్‌పై వెళితే.. సమస్యలు పరిష్కారమయ్యేదెలా?
- రైతు గోడు పట్టని అధికార యంత్రాంగం.. పేరుకుపోనున్న సమస్యలు

యాచారం, జూన్ 15 : తమ గోడును రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. భూ రికార్డులు ధరణి పోర్టల్‌లో తప్పుగా ఉన్నా.. అధికారులు సరి చేయకపోవడం దారుణమని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు నెలలుగా మండల డిప్యూటీ తహసీల్దార్ కార్తిక్‌సాగర్ కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో రైతుల సమస్యలతో పాటు విద్యార్థులకు అవసరమైన కులం, ఆదాయం వంటి ధ్రువపత్రాలు సకాలంలో అందక నానా ఇబ్బందుల పాలవుతున్నారు. ఇదిలా ఉంటే, తహసీల్దార్ అయ్యప్పను నగరంలోని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్(ఎంఆర్‌ఎఫ్‌డీసీ)లో విధులు నిర్వహించడానికి డిప్యుటేషన్‌పై పంపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో నగరంలోని ఎంఆర్‌ఎఫ్‌డీసీ కార్యాలయంలో జాయిన్ అయ్యేందుకు తహసీల్దార్ సిద్ధమయ్యారు. అయితే, ధరణి భూసమస్యలపై పది రోజుల స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. దాంతో స్పెషల్‌డ్రైవ్ ముగిసేదాకా ఇక్కడే విధులు నిర్వహించాలని కలెక్టర్ శనివారం తహసీల్దారును ఆదేశించడంతో ఇక్కడే సిబ్బందితో ధరణి సమస్యల రికార్డులను సరిచేయడంలో నిమగ్నమయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులకు సంబంధించి 2,550 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అయితే, పది రోజుల తరువాత కొత్తగా తహసీల్దార్ వస్తారా? లేదా? అనేది సందేహాత్మకంగా మారింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఇద్దరినీ డిప్యుటేషన్‌పై పంపడం సరికాదని పలువురు రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.


నాలుగు నెలలుగా డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న ఆయన చాంబర్

గుండ్లపోచంపల్లి కమిషనర్‌కు సన్మానం


మొక్క నాటుతున్న కమిషనర్ రాములు

మేడ్చల్ టౌన్, జూన్ 15: ఈనెల 29న ఉద్యోగ విరమణ పొందనున్న గుండ్లపోచంపల్లి కమిషనర్ రాములును మున్సిపల్ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, సాయిపేట శ్రీనివాస్ యాదవ్‌లు శనివారం శాలువాకప్పి సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించారు. కమిషనర్ రాములు సేవలకు గుర్తింపుగా మున్సిపల్ పరిధిలో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ గౌడ్ ,శ్రీనివాస్ రెడ్డి , వెంకటేష్, భాను చందర్ పాల్గొన్నారు.

ఘనంగా దర్గా గంధోత్సవం


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మత పెద్దలు, నాయకులు

కొడంగల్, జూన్ 15: కొడంగల్ శివారులోని షేక్ పహాడీ దర్గాలో హజ్రత్ షేక్ జాబర్ బిన్ అహ్మద్ అస్రారుల్ హక్ ఖాద్రి 29వ ఉర్సు ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఉర్సు ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం దర్గాలో దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అహ్మద్, గుల్బర్గకు చెందిన జిలానీపాష, యాద్గీర్‌కు చెందిన మొహ్మద్ హుసేన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎస్ఎం.గౌసన్, ఆసీఫ్‌ఖాన్, ఖైరత్ అలీ ఖాద్రీ, సయ్యద్ జుబేర్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలవ్వాలి

శామీర్‌పేట, జూన్ 15: రక్తదానంతో ప్రాణదాతలవ్వాలని మాజీ ఉపసర్పంచ్ యూసూఫ్‌బాబా అన్నారు. తుర్కపల్లి పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు, గ్రామ నాయకులు ప్రముఖ సంగీత దర్శకుడు దివంగత చక్రి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా మహిత్ నారాయణ్ గారి సహకారంతో ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యువజన సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు షేక్‌ఇబ్రహీం, ఆర్గనైజర్లు బాబు, మల్లేశ్, శ్రావణ్, రుద్రబోయిన సాయికిరణ్, ఆర్టిస్టు విజయలక్ష్మి, మూమి డైరెక్టర్ బాబు, జబ్బర్‌దస్త్ రాకింగ్ రాకేష్ పాల్గొన్నారు.

మార్వాడీ మంచ్ ఆధ్వర్యంలో..


రక్తదాన శిబిరంలో నిర్వాహకులు

తాండూరు: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో బాలాజీ మందిరంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తాండూరు బ్లడ్‌బ్యాంక్ ద్వారా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 21మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంచ్ అధ్యక్షుడు అనిల్ సార్డా, కార్యదర్శి సచిన్ పాల్గొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టేందుకే చెక్‌పోస్టులు


వాహనాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి గీత

మోమిన్‌పేట్, జూన్ 15: శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, జంతువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేకాధికారిణి గీత తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బక్రీద్ పండగ సందర్భంగా గోవులు, లేగదూడల అక్రమ రవాణా చేయొద్దన్నారు. వ్యాపారులు పశువుల క్రయ, విక్రయాల్లో భాగంగా కచ్చితంగా గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ అధికారులతో ధ్రువీకరించిన రశీదులను కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బలరాం తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' నీటి సరఫరాపై సర్వే


సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ధారూరు, జూన్ 15: మిషన్ భగీరథ నీటి సరఫరాపై ధారూరులో పంచాయతీ, ఐకేపీ సిబ్బంది కలిసి శనివారం సర్వే నిర్వహించారు. ధారూరు, లక్ష్మీనగర్ తండా, తిమ్మానగర్ తండాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. శనివారం వరకు పంచాయతీ పరిధిలో 450ఇళ్లను సర్వే చేశామని సర్వే సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శి అంజనాయక్, ఐకేపీ వీవోఏలు సుజాత, పరమేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

పరిగి, జూన్ 15: పరిగి మండలం రంగంపల్లి గ్రామానికి ఏఎస్ఐ దివంగత శివశంకర్ ఏడవ వర్థంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వారి సతీమణి విజయ, కుమార్తెలు సుధారాణి, శ్వేత, స్వాతి కలిసి రంగంపల్లి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల వస్తువులు అందజేశారు. విద్యార్థులకు అవసరమయ్యే వాటర్‌బాటిల్స్, ప్యాడ్‌లు, పెన్నులు, న్యూట్రిషన్ ఫుడ్‌ప్యాకెట్లు అందజేశారు. పాఠశాల విద్యార్థులకు చేయూతను అందించడం అభినందనీయమని హెచ్ఎం రాములు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు, గంగాధర్, రాజేందర్, కృష్ణ, మమతలు పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్ సందనిగడ్డ ప్రాథమిక పాఠశాలలో శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులతో అక్షరాలు రాయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు సుమ, చైర్మన్ సత్యమ్మ, వెంకటేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం

కొడంగల్, జూన్ 15: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆరు గ్యారంటీల్లో ఏదైనా పథకం వరించని లబ్ధిదారులకు సలహాలు, సూచనలు చేయడంతో పాటు పథకం వర్తించేలా ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.

చిరువ్యాపారుల షెడ్ల తొలగింపు


ఆర్టీసీ స్థలంలో ఉన్న రేకుల షెడ్లను తొలగిస్తున్న ఆర్టీసీ అధికారులు

మర్పల్లి, జూన్ 15: ఎన్నో సార్లు నోటీసులు ఇచ్చినా ఆర్టీసీ స్థలాన్ని ఖాళీ చేయడం లేదని అధికారులు వాటి తొలగింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం పోలీసు బందోబస్తుతో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లను జేసీబీల ద్వారా తొలగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో చిరువ్యాపారులు అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. షెడ్లను కూల్చివేయడంతో సామగ్రి ధ్వంసమవుతుందని, తమకు సమయం ఇవ్వాలని చిరువ్యాపారులు కోరారు. దీంతో పోలీసులు కల్పించుకొని మధ్యాహ్నం వరకు సమయం ఇస్తున్నామని, అప్పటిలోగా తమకు షెడ్లను తొలగించుకోవాలని సూచించారు. కొంత మంది వ్యాపారులు షెడ్లను తొలగించగా మరి కొంత మంది వ్యాపారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల సమయం కావాలని కోరారు. బక్రీద్ పండుగ ముగిసిన తర్వాత ఖాళీచేస్తామని ప్రజాప్రతినిధులకు తెలపడంతో ఆర్టీసీ, అధికారులతో వారం రోజుల గడువు ఇవ్వాలని కోరారు. దీంతో అధికారులు ససేమిర అనడంతో ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని, ఇక సమయం ఇచ్చేదే లేదని తేల్చిచెప్పారు. కనీసం రెండు, మూడు రోజులైనా సమయం ఇవ్వాలని చిరువ్యాపారులు అధికారులను కోరారు.

వేలం దక్కించుకున్న వారికి అవకాశం

ఆర్టీసీ స్థలాన్ని వేలం వేసినట్లు అధికారులు తెలిపారు. వేలం దక్కించుకున్న వారు ఇక్కడ షెడ్లను ఏర్పాటు చేస్తే అద్దెకు ఇచ్చే అవకాశంఉందని తెలిపారు. ఏళ్లగా వ్యాపారం చేస్తున్న వ్యాపారులను గుర్తించి షెడ్లను అద్దెకు ఇచ్చేలా ప్రాధాన్యత కల్పిస్తామని అధికారులు హామీఇచ్చారు.

వాణిజ్య భవనాల పన్ను పెంపునకు తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్

ఘట్‌కేసర్, జూన్ 15: మున్సిపాలిటీలో ఆదాయ వనరుల పెంపునకు చేపట్టిన చర్యల్లో భాగంగా వాణిజ్య భవనాల ట్యాక్సును 0.15శాతం నుంచి 0.30శాతం పెంచుతూ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సోమవారం జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా మసీదుల వద్ద ఏర్పాట్లు చేయడానికి రూ.1.20లక్షలు, డ్రైనేజీల మరమ్మతు పనులకు రూ.15లక్షలు, బీటీ రోడ్ల మరమ్మతు పనులకు రూ.5లక్షలు, హరితహారం మొక్కల రవాణాకు రూ.5లక్షలు, మున్సిపాలిటీ మడిగెల మరమ్మతు పనులకు రూ.5లక్షలు కేటాయిస్తు తీర్మానం చేశారు. అదేవిధంగా ఇంటిపన్నులు సైతం 0.5శాతం పెంచాలనుకున్నప్పటికీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో నివాసేతర(వాణిజ్య) భవనాలకు 0.15శాతం ఉన్న ట్యాక్సులను 0.30శాతం రెట్టింపు చేస్తూ తీర్మానం చేశారు. ఈతీర్మానాన్ని 17వ వార్డు కౌన్సిలర్ బి.నర్సింగ్‌రావు వ్యతిరేకించారు. వాణిజ్య భవనాలకు సైతం పన్నులను ఒక్కసారిగా పెంచడం సరికాదని తీర్మానానికి ఆమోదం తెలపకుండా నిరసన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో నిబంధలనకు విరుద్దంగా కొంత మంది సిబ్బంది పనిచేస్తున్నారని కౌన్సిలర్లు నర్సింగరావు, ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. తీర్మానాలు లేకుండా సిబ్బందిని నియమించి వారికి వేతనాలు ఇవ్వాలనడం చైర్‌పర్సన్ ఒంటెత్తుపోకడలకు నిదర్శనమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పల్గుల మాధవరెడ్డి, కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షం


యువకులను బీజేపీ పార్టీలో చేర్చుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, జూన్ 15: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నిరంగాల్లో ఉత్తమ అభివృద్ధి చెందుతుందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని అలియాబాద్ గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ వంగరి హృదయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం అలియాబాద్‌కు చెందిన పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ మండల ఎస్సీసెల్ వర్కింగ్ అధ్యక్షుడు ఒట్టెలగణేష్, మరో 20 కార్యకర్తలు ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో నూతనంగా బీజేపీలో చేరారు. వీరిని ఈటల రాజేందర్ సాదరంగా ఆహ్వానిస్తూ కండువాలను కప్పి బీజేపీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు కైర యాదగిరి, కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు మల్యాల మహేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు తుమ్మ బాలకృష్ణ, గ్రామ బీజేపీ నాయకులు తుమ్మ వివేకానంద్, ఇప్ప బ్రహ్మానందరెడ్డి, చెరుకుల రాముయాదవ్, తాడెం కుమార్, పాల్గొన్నారు.

పూడూరు: పూడూరు గ్రామ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు నవీన్ జోషి పంతులు బీజేపీలో చేరారు. హైదరాబాద్ లోని ఎంపీ రాజేందర్‌రెడ్డి నివాసంలో శనివారం బీజేపీలో చేరగా, రాజేందర్‌రెడ్డి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్, వికారాబాద్ కంటెస్టెన్స్ ఎమ్మెల్యే నవీన్, పూడూరు మండల అధ్యక్షుడు రాఘవేందర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూగర్భ వంతెన నిర్మాణం చేపట్టాలి

ఘట్‌కేసర్, జూన్ 15: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిని దాటేందుకు భూగర్భ వంతెన నిర్మించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు శనివారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, బెజ్జంకి హరిప్రసాదరావు, సర్వీ రవీందర్‌గౌడ్, నాయకులు బద్దం జగన్ మోహన్‌రెడ్డి, అబ్బితిని నర్సింహ, అకిటి బాల్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మా ఆరోగ్యం ఏం కావాలి?

- పెండ్లిమడుగులో కాలం చెల్లిన మందులు పంపిణీ చేసిన ఏఎన్ఎం
- గ్రామస్తుల ఆరోపణ


ఏఎన్ఎం అందించిన మందులను చూపిస్తున్న గ్రామస్తుడు

వికారాబాద్, జూన్ 15 :వికారాబాద్ మండలం పెండ్లిమడుగు గ్రామంలో పలువురికి ఏఎన్ఎం కాలం చెల్లిన మందులు పంపిణీ చేసిందని గ్రామస్తులు ఆరోపించారు. కాలం చెల్లిన మందులను వృద్ధులు, గర్భిణులకు అందించారని తెలిపారు. ఇలా అయితే తమ ఆరోగ్యాలు ఏమవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ మేరకు డీఎంహెచ్‌వో పల్వన్ కుమార్‌ను వివరణ కోరగా విచారణ చేపడుతున్నామని పూర్తి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు


చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కులకచర్ల బీజేపీ నాయకులు

కులకచర్ల, జూన్ 15: చేవేళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని కులకచర్ల మండల బీజేపీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో తన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి, గాదె మహిపాల్, జెమిని సూర్యకాంత్, శ్రీనివాస్, మహిపాల్, హనుమంతు, నర్సింహారెడ్డి, మహిపాల్, భీమయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 43శాతం పనులు పూర్తి


కోటబాస్పల్లి పాఠశాలలో కుళాయిలను పరిశీలిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, జూన్ 15: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న మౌలిక సదుపాయాల పనులు 43శాతం వరకు పూర్తయ్యాయని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. అమ్మ ఆదరణ కింద కొనసాగుతున్న పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన పనులను ఆయన శనివారం పరిశీలించారు. తాండూరు మండల పరిధిలోని కోటబాస్పల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే పనులను పరిశీలించారు. తాండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ కింద ఇప్పటి వరకు 60శాతం పనులు పనులు పూర్తయ్యాయని, మరో 40శాతం పనులను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి లాలప్ప, కోటబాస్పల్లి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలి

బషీరాబాద్, జూన్ 15: పంచాయతీ కార్మికుల ఏడు నెలల పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం బషీరాబాద్ ఎంపీవో రమేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ మట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ నాయకులు సురేష్, తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు శామప్ప, కార్మికులు రాజు, చందు, శాణప్ప, లక్ష్మి, మొగులప్ప, దేవమ్మ, బీమమ్మ అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎక్మాయిలో పైపులైన్ లీకేజీ



బషీరాబాద్, జూన్ 15: ఎక్మాయిలో తాగునీటి సరఫరా పైపులైన్ లీకేజీలతో నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పలు వార్డుల్లోకి డైరెక్టు పంపింగ్ సిస్టం బోరుతో పైపుల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఈ నీటి సరఫరా పైపులు పలు చోట్ల లీకేజీలు ఉండటంతో తమ ఇళ్లకు నీరు సక్రమంగా రావడంలేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మిషన్ భగీరథ నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని వారంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

- **శామీర్‌పేట:** మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 18వ తేదీన ఉదయం 10గంటలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల బహిరంగసభను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మమతాబాయి తెలిపారు. ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పథకంలో 2023- 2024 జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు మండలంలోని ఉపాధి హామీ పథకం కూలీలు అత్యధికసంఖ్యలో తరలిరావాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు.
- **బొంరాస్‌పేట్:** శ్రీగీత సత్సంగ్ సేవా సమితి తాండూర్, దుద్యాల గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు సేవాసమితి సభ్యులు శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుద్యాలలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.
- **వికారాబాద్:** కొన్ని సంవత్సరాలుగా పదోన్నతులు లేకుండా పనిచేస్తున్న భాషా పండితులకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చిందని ఆర్‌యూపీపీటీ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌యూపీటీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి కాంతి కృష్ణ ఆధ్వర్యంలో విజయం సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి భాషా పండితులందరి పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.
- **ధారూరు:** ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయత్రం ధాన్యం, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. ధాన్యం 1010రకం క్వింటాలుకు రూ.2,100 నుంచి రూ.2,125 వరకు, సోనామసూరి రకం క్వింటాలుకు రూ.2,000ల నుంచి రూ.2,280ల వరకు, మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,450ల నుంచి 2,500ల వరకు ధర పలికినట్లు మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు. ధాన్యం 1010రకం 57.2క్వింటాళ్లు, సోనామసూరి 48క్వింటాళ్లు, మొక్కజొన్న 23క్వింటాళ్లు విక్రయించినట్లు తెలిపారు.
- **బొంరాస్‌పేట్:** తుంకిమెట్ల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట ఎరువు, జనుము అందుబాటులో ఉన్నట్లు ఏవో అనురాధ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 50శాతం సబ్సిడీపై జనుము బస్తా ధర రూ.1448 నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.
- **బొంరాస్‌పేట్:** ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో జీరో విద్యుత్ బిల్లు రాకుంటే వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని బొంరాస్‌పేట్ విద్యుత్‌శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో


ప్రమాదానికి కారణమైన కారు

బొంరాస్‌పేట్, జూన్ 15: రోడ్డుప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలో శనివారం జరిగింది. బొంరాస్‌పేట్ నమాజ్ గుట్ట సమీపంలో తాండూర్ నుంచి కొడంగల్‌కు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వస్తూ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఈడిగి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బొంరాస్‌పేట్ పోలీసులు తెలిపారు.

భూతగాదాలో వ్యక్తికి..

దోమ, జూన్ 15: భూతగాదాలో ఓ వ్యక్తిపై గొడ్డలి, కర్రలతో దాయాదులు దాడి చేయడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌కుమార్, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కోస్గి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బుసకోటి రామకృష్ణకు దోమ మండలం గుండాల గ్రామ శివారులో సర్వే నెం.73లో వ్యవసాయ భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన దాయాదులు పిట్ల కృష్ణయ్య, పిట్ల వెంకట్రాములు, సాయిలు, శివ అనే వ్యక్తుల మధ్య భూవివాదం కొనసాగుతోంది. ఈక్రమంలో శనివారం వారి మధ్య ఘర్షణ జరిగింది. సర్వే నెం.73లో కొంత భాగం భూమి తమకు వస్తుందని దాయాదులు కోరినప్పటికీ సదరు రైతు వదలకపోవడంతో బుసకోటి రామకృష్ణకు దాయాదులైన పిట్ల కృష్ణయ్య, పిట్ల వెంకట్రాములు, సాయిలు, శివ మధ్య ఘర్షణ జరిగింది. కర్రలు, గొడ్డళ్లతో దాడి చేసుకునేంత వరకు వెళ్లింది. ఈ ఘర్షణలో బుసకోటి రామకృష్ణకు తీవ్ర గాయాలు కాగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువర్గాల వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

కిరాణ షాపులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


కిరాణ షాపులో దూసుకెళ్లిన ట్రాక్టర్

యాలాల, జూన్ 15: అదుపు తప్పి ఓ ట్రాక్టర్ గ్రామంలోని కిరాణా షాపులకు దూసుకెళ్లింది. శనివారం యాలాల మండల పరిధిలోని రాస్నాం గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్యేక సాక్షులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రఫీక్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పొలంలో పని చేసుకోని ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామంలో గల ఒక కిరాణా షాపులకు తీసుకెళ్లింది. దీంతో షాప్ దగ్గర గోడలు పగిలి డ్యామెజ్ అయింది. ఈ సంఘటనలో ఎవరికి కూడ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

భవనంపై నుంచి పడి ఉద్యోగిణి మృతి


అనురాధ(ఫైల్)

తాండూరు రూరల్, జూన్ 15: హైదరాబాద్‌లో భవనం పైనుంచి పడి ఓ ఉద్యోగిణి మృతి చెందింది. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం గోనూరుకు చెందిన సేరి జనార్ధన్‌రెడ్డి, అనురాధ(40) దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. జనార్ధన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, అనురాధ నగరంలోని ఓ ప్రభుత్వ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. గురువారం అనురాధ హైదరాబాద్ సమీపంలోని నార్సింగ్‌లోని భవనంపైనుంచి కిందపడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హైదరాబాద్‌కు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే ఆమె మృతికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు. అనురాధ అంత్యక్రియలు ఆదివారం(నేడు) గోనూరులో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రెండు చోట్ల చైన్‌స్నాచింగ్

మూడుచింతలపల్లి, జూన్ 15: రెండు వేర్వేరు గ్రామాల్లో చైన్‌స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన గోనె రత్నమ్మతో పాటు గంగం బుచ్చమ్మ ఇద్దరు ఇంటి ముందు గల అరుగుపై కూర్చున్నారు. అదేసమయంలో గుర్తుతెలియని వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు హిందీలో ఏదో అడగడంతో సదరు మహిళ అర్థంకాక పక్కకు తిరిగింది. అదే అదనుగా బైక్‌పై వెనుక కూర్చున్న వ్యక్తి ఆమె మెడలో ఉన్న 2తులాల బంగారు పుస్తెలతాడు తెంపుకుని పారిపోయాడు. దీంతో ఆమె కూకలు వేయడంలో స్థానికంగా ఉన్న ఇద్దరు బైక్‌ను వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆ మహిళ శామీర్ పేట్ పోలీసులను ఆశ్రయించింది. మరో ఘటన నంతారం గ్రామంలో జరిగింది. భట్టు సత్యలక్ష్మి అనే మహిళ ఇంటి నుంచి వెళ్తుండగా గ్రామ పంచాయితీ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు నలుపు రంగు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న 3.5తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని వెళ్లారు. ఈవిషయమై శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి


కార్యదర్శి మౌనికకు వినతి పత్రాన్ని అందజేస్తున్న యువనాయకులు

శామీర్‌పేట, జూన్ 15: చౌరస్తాల్లో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని శామీర్‌పేట యువనాయకుల వెంకటేష్‌గౌడ్, అరుణ్ కుమార్, ప్రభాకర్‌లు పంచాయతీ కార్యదర్శి మౌనికకు వినతిపత్రాన్ని అందజేశారు. వారు శనివారం శామీర్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శి మౌనికను కలిసి టాయిలెట్ల సౌకర్యాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. శామీర్‌పేట గ్రామ పరిధిలోని సబ్‌రిస్ట్రేషన్ కార్యాలయం వద్ద, బ్యాంకుల సమీపంలో, పోలీస్ స్టేషన్ చౌరస్తావద్ద, వైఎస్ విగ్రహం చౌరస్తా వద్ద, దర్గా చౌరస్తా వద్ద ప్రజలు ఎక్కువగా తిరుగుతారని అన్నారు. ప్రజా టాయిలెట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని వారు కార్యదర్శి మౌనికకు విజ్ఞప్తి చేశారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

వికారాబాద్, జూన్ 15: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌వెంకట్ రత్నం అన్నారు. జిల్లా విద్యాధికారి రేణుకాదేవిని కలిసి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌యూటీఎఫ్ 11ఏళ్ల ఉద్యమ ఫలితమే బదిలీలు, పదోన్నతులు అన్నారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకూడదని, ఒక వేళ అలా జరిగితే పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని అన్నారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

దోమ, జూన్ 15: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అనసూయ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశం రసాభాసగా మారింది. ముగ్గురు పిల్లలు ఉన్న బొంపల్లి ఎంపీటీసీ రాములను సమావేశానికి ఎందుకు అనుమతించారని అదే గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ సురేశ్ గందరగోళం సృష్టించారు. ఎంపీపీ అనసూయ, వైస్ ఎంపీపీ మల్లేశం కల్పించుకొని బొంపల్లి ఎంపీటీసీ రాములుకు ముగ్గురు పిల్లలు ఉన్న విషయం ఎన్నికల కమిషన్ లేదా కోర్టు పరంగా తేల్చుకోవాలే తప్ప అనవసర వాగ్వాదం చేయడం సరైందికాదని సమావేశం నుంచి బయటకు పంపించారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించగా సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.